15న ప్రతీ గ్రామంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర: కలెక్టర్

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో ఈనెల 15న ప్రతీ గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రభుత్వం రూపొందించిన యాప్ నందు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ తహశీల్దార్లకు సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సబ్ కలెక్టర్లు, రెవిన్యూ అధికారులతో స్వచ్ఛాంధ్ర, రెవెన్యూ సమస్యలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు.

ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రీ సర్వే పక్కగా జరగాలని, రీ సర్వేను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న గృహ నిర్మాణాల్లో అసంపూర్తి గృహ నిర్మాణాల పూర్తికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అన్నారు. పిఎంఏవై 1.0 కింద ఇల్లు మంజూరై వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సహాయం అందిస్తుందన్న సంగతిని లబ్ధిదారులకు వివరించి, త్వరితగతిన పూర్తిచేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, కెఆర్ఆర్ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మ చంద్రారెడ్డి, మండల తహశీల్దారు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

విశాలాంధ్ర - సీతంపేట: ఆంధ్ర ప్రదేశ్ గిరిజన రైతు సంఘం, మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో కలెక్టర్ ఆఫీసు వద్ద 48 గంటలు ధర్నా చేయడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. జీడి పిక్కలుకు మద్దతు ధర కల్పించి, జిసిసి ద్వారా కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని, అదే విధంగా అనేక మంది విద్యార్థులు ఇంటర్, డిగ్రీ, పీజీ చదువుకొనుటకు అందుబాటులో ప్రభుత్వ కళాశాల లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రైవేట్ కళాశాలలో చదువుటకు ఆర్థికంగా వెనకబడి ఉండడంతో చదువులకు దూరమై నిరుద్యోగులుగా మిగులుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక స్వరవతో కళాశాలలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలను మూసివేయొద్దని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై ఈ నెల 17, 18 తేదీల్లో పార్వతిపురం మన్యం జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.సాయి, జె. శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

మినీ గోశాల నిర్మాణాల పరిశీలన

విశాలాంధ్ర - మక్కువ: తూరు మామిడి గ్రామంలో గ్రామీణ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మినీ గోశాలలు, ఇంకుడు గుంతల నిర్మాణాలను గురువారం

ఎంపీడీవో డిడి స్వరూప రాణి పరిశీలించారు. అనంతరం తూరిమామిడి సచివాలయాన్ని పరిశీలించి, సచివాలయ సిబ్బంది చేస్తున్న పి ఫోర్ సర్వే పరిశీలించారు. ఇప్పటివరకు 54% మాత్రమే సర్వే చేసినందున, ఆమె అసంతృప్తి వ్యక్తపరిచారు. ఎట్టి పరిస్థితిలలో ఈనెల 15వ తేదీ లోపు సర్వేని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తూరిమామిడి సర్పంచ్ రెడ్డి కృష్ణమ నాయుడు, ఉపాధి హామీ సాంకేతిక సహాయకులు జె.శ్రీకాంత్, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆశీల వసూళ్లు పాట ఖరారు

విశాలాంధ్ర - పాలకొండ: పాలకొండ నగర పంచాయతీ పరిధిలో ఉన్న ఆసీల వసూళ్ల పాట గురువారం ఖరారు అయ్యింది. కమిషనర్ టి.జయరాం, సిబ్బంది ఆధ్వర్యంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ వివరాలను వెల్లడిస్తూ ఈ బహిరంగ వేలం పాటలో కటకం దుర్గారావు అనే వ్యక్తి హెచ్చు పాటదారిగా 13 లక్షల 57 వేల రూపాయలకు దక్కించుకున్నారన్నారు. సదరు ఈ వేలంపాటను కౌన్సిల్ తీర్మానం చేయాల్సి ఉంది అని తెలిపారు. ఆయనతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకుందాం

అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడమే మన ముందున్న ప్రధాన లక్ష్యమని దీనికి ప్రజలందరూ పూర్తిసహాయ సహకారాలు అందించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం 2.0 కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా ఆయన గురువారం చినమేరంగి దళితవాడలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావుతో కలసి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం తయారు చేస్తున్న నాటు సారా అమ్మకం రవాణా అనేవి నేరాలుగా నిర్దేశించబడుతున్నందు వలన దీనిని ప్రతి ఒక్కరు అవగాహన చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. గతంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి. శ్రీనాథుడు ఉన్న పరిస్థితులు ఇప్పుడున్న పరిస్థితికి వ్యత్యాసానికి పూర్తి భిన్నంగా కనబడుతుందని ఆయన అన్నారు. కురుపాం ఎక్సైజ్ సిఐ పి. శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో తయారీదారుల పేర్లు అరెస్టు కావలసిన వారి పేర్లు చదివి వినిపించిన ఆయన వీళ్ళందరూ మండల తహసీల్దారు వద్ద బైండోవర్ కేసు నమోదు చేయించుకోవాల్సి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈఎస్ పి.జీవన్ కిషోర్, ఎస్ఐ రాజశేఖర్, స్థానిక గ్రామ సర్పంచ్ అల్లు రవణమ్మ, రెండు జిల్లాల ప్రొహిబిషన్ ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆత్యం మైనింగ్ అరాచకాలు ఆపాలి: సీపీఐ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఆత్యం మైనింగ్ ప్రైవేట్ కంపెనీ ఆగడాలపై జిల్లా అధికారులు జోక్యం చేసుకొని ఆపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. అనేకమంది అధికారులు మైనింగ్ చేస్తున్న ఏరియాను పరిశీలించడం జరిగిందని, పరిశీలించిన ప్రతి అధికారి కూడా మైనింగ్ జరుగుతున్నది అక్ర మమని మీకు న్యాయం చేస్తామని బాధిత ప్రజలందరికీ హామీలు ఇచ్చినప్పటికీ ఆత్యం మైనింగ్ కంపెనీ పనులు మాత్రం యధాతథంగా జరుగుతున్నాయన్నారు. గ్రామంలో ఇప్పటికీ మైనింగ్‌తో వచ్చిన దూళి ప్రభావంతో అనేకమంది రోగాల బారి పడి ఇబ్బందులు పడుతుండటం చూస్తున్నామన్నారు. నాలుగు రోజుల నుండి ఆత్యం మైనింగ్ ఏరియా నుండి పెద్దపెద్ద లారీ లోడ్లతో వస్తున్న లారీలను గ్రామస్తులు అడ్డుకుంటున్నారని ఈ సందర్భంలోనే పోలీసు వారు పెద్ద ఎత్తున గ్రామాల్లోకి వచ్చి లారీలను అడ్డుకుంటున్న బాధితులను భయ పెడుతూ, బెదిరిస్తూ ఉండడం జరుగు

తుందని, ఈరోజు కూడా సుమారు 40 మంది పోలీసులతో పెద్ద గుడబ గ్రామం వెళ్లి లారీలు అడ్డుకుంటున్న బాధితులను చెల్లాచెదరు చేస్తూ, ఒక నలుగురు రైతులను దౌర్జన్యంగా ఎత్తుకు వెళ్లి అరెస్టు చేయడం జరిగిందని, దీనిని పెద్ద ఎత్తున గ్రామాల ప్రజలు నిరసిస్తూ కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి జాయింట్ కలెక్టర్‌కి, తెలియజేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి అత్యం మైనింగ్ కంపెనీ ఆగడాలను అరికట్టి బాధిత ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, సీనియర్ నాయకులు బొత్స మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి నీటిని ఇచ్చి వేసవి దాహార్తి తీర్చండి

విశాలాంధ్ర - పాలకొండ: పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ జల వనరుల శాఖ ప్రాంతీయ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు మాట్లాడుతూ బ్రిటిష్ వారు ఏర్పాటు చేసిన తోటపల్లి ఆనకట్ట నుండి ఆనాటి నుంచి కూడా ఎడమ కాలువ నుండి సంవత్సరానికి రెండు పంటలు పండించడానికి నీరు ఇచ్చేవారని అన్నారు. తోటపల్లి కాలువల ఆధునీ కరణ పనులు ప్రారంభించిన తర్వాత వేసవి కాలంలో నీరు విడుదలను నిలిపివేశారని, అయితే ఆధునీకరణకు కావలసిన నిధులలో 25 శాతం లోపు కూడా పనులు పూర్తి చేయని పనులను రాష్ట్ర, ఎన్డీఏ ప్రభుత్వం నిలుపుదల చేయడం జరిగిందన్నారు. పాలకొండ, బూర్జ మండలాలలో గల ఆయకట్టు పరిధిలో గల గ్రామాల చెరువులకు నీరు అందక ఈ ప్రాంత వాసులు నానా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వీర ఘట్టం మండలం వరకు నీరు ఇస్తే సరిపోతుందని ఆలోచన సరికాదని, కాలువలు చివరివరకు నీరు ఇవ్వకుండా నిలుపుదల చేస్తామనడం అన్యాయం అన్నారు. వేసవి దాహాలు తీర్చడానికి నీరు కొనసాగించకపోతే ఈనెల 17న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి మహా ధర్నా చేయక తప్పదని హెచ్చరించారు. ధర్నాలో కే.రామకృష్ణ (బాసురు నీటి సంఘం అధ్యక్షులు), ఆయా నీటి సంఘాల డైరెక్టర్లు పామోటి వైకుంత రావు, దుప్పాడ గౌర్నాయుడు, దుప్పాడ చిన్నమనాయుడు, నేతల ప్రభాకర్‌రావు, ఆర్.ప్రభాకర్‌రావు, కోట విశ్వేశ్వరరావు, కిమిడి రామ్మూర్తి నాయుడు, సంఘం నాయుడు, ఉదయాన చిన్నమనాయుడు, బి.శివకుమార్, కన పాక సత్యం, డి.నారాయణరావు, జి.సురేష్, బి.రామారావు పాల్గొన్నారు.

దృష్టి లోపాలను సరిచేసుకోవాలి: కలెక్టరు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్/బెలగాం: జిల్లాలోని ప్రతీఒక్కరూ తమ దృష్టి లోపాల పరీక్షలను నిర్వహించుకొని, వాటిని సరిచేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలలో ఉచిత కంటి పరీక్షల కార్యక్రమం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉచిత కంటి పరీక్షల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన కంటి పరీక్షల్లో పాల్గొని తమ కళ్లను పరీక్షించుకున్నారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ సర్వేంద్రి యానాం నయనం

ప్రధానమని, మానవ శరీరంలో అన్ని అవయవాల కంటే కళ్లు ప్రధానమైనవని అన్నారు. అటువంటి కళ్లను సంరక్షించుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. యస్.అప్పారావు, జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా.ఎం.వినోద్ కుమార్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వైద్యాధికారులు, లయన్స్ ప్రాజెక్ట్ చైర్మన్ డా.జి.వాసు దేవరావు, కన్వీనర్ డా.యన్ దుర్గా ప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - గుమ్మలక్ష్మీపురం: కురుపాం నియోజకవర్గం, గుమ్మలక్ష్మిపురం మండలంలో విష జ్వరాలు విస్తృతంగా వ్యాప్తి జరుగుతున్న విషయం తెలుసుకొని మండల కన్వీనర్ పాడి సుదర్శన్, బిడ్డిక పద్మావతి ఆధ్వర్యంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ భద్రగిరి సామూహిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి విష జ్వరాలు అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలను గూర్చి వైద్యాధికారితో మాట్లాడి తెలుసుకొని ఇంకొంచం విరివిగా పనిచేయాలని సూచించారు. తరువాత నూతనంగా నిర్మిస్తున్న హాస్పిటల్ భవనం సందర్శించి పనులు ఇంకా వేగవంతం చేయాలని అక్కడ సిబ్బందిని కోరారు. అలాగే ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి గిరిజన గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రత పరిరక్షణ పటిష్టంగా చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మిపురం మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గిరిజనుల గొంతెండుతోంది...!

నీరు కావాలంటే కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిందే

ఊటగెడ్డలను ఆశ్రయించి రోగాల బారిన పడుతున్న గిరిజన ప్రజలు

విశాలాంధ్ర - పాడేరు: మండు వేసవి మొదటిలోనే తాగునీటికి గిరిజన పల్లెలు అల్లాడిపోతున్నాయి. మంచినీటి పథకాలు లేక కొన్నిచోట్ల.. ఉన్నవి మూలనపడి మరికొన్నిచోట్ల దాహార్తితో జనం అలమటిస్తున్నారు. నెత్తిన బిందెలు పట్టుకుని మహిళలు బావులు, వాగులు పొలాల మధ్యలో ఊటగెడ్డలను కిలోమీటర్ల దూరం నడిచివెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కూలినాలి చేసుకునే బడుగు జీవులు సైతం నేడు ఆర్వో ప్లాంట్లకు వెళ్లి మంచినీళ్లు కొనుక్కోవాల్సి వస్తోంది. తాగునీరందించే బోర్లు, రక్షిత పథకాలు ఏళ్ల తరబడి పనిచేయకపోయినా సంబంధిత

ఆర్డబ్ల్యూఎస్ అధికారులు మరమ్మతుల ఊసెత్తని పాలకుల నిర్లక్ష్యం సాక్షిగా.. గిరిజన ప్రాంతవ్యాప్తంగా పల్లె ప్రజలు తాగునీటి కోసం పడరాని పాట్లు పడుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన పల్లెలకు తాగునీటి సమస్య ఉండకూడదని కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని గొప్పలు చెబుతున్నప్పటికీ గిరిజన ప్రాంతంలో అనేక గ్రామాలకు రక్షిత మంచినీరు అందని ద్రాక్షగా ఉంది. గిరిజన ప్రజలు పొలాల్లో ఉన్న ఊట గెడ్డలు, వాగుల నుండి వచ్చే నీరు కిలోమీటర్ల మేర కాలినడకన వెళ్లి తెచ్చుకొని అది త్రాగి అనేక రోగాల బారిన పడి ఆసుపత్రి పాలవుతూ ప్రాణాలు విడుస్తున్న పరిస్థితి నేడు నెలకొంది. అటు సంబంధిత అధికారులు నిర్లక్ష్యం పాలకుల శాపమో తెలీదు కానీ గిరిజన గ్రామాలలో గిరిజనులు మంచినీటి కోసం విలవిల ఆడుతున్నారు. పట్టణ ప్రాంతాలతో పాటు గిరిజన ప్రాంతాల్లో మంచినీటి సౌకర్యం కల్పించాలని దీనిపై జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని పలు ప్రజా సంఘాలు కోరుతున్నాయి.

అరకు కాఫీకి అరుదైన గౌరవం పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్‌కు అనుమతి

విశాలాంధ్ర - అరకులోయ: పార్లమెంట్లో అరకు కాఫీకి ప్రత్యేక స్థానం కల్పించేందుకు అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు కోసం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అనుమతి ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, టీడీపీ ఎంపీ లావు కృష్ణదేవరాయలు, బీజేపీ ఎంపీ సీఎం రమేష్ స్పీకర్ ఓం బిర్లాను కలిసి అరకు కాఫీ ప్రాముఖ్యతను వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కాఫీ ఉత్పత్తుల్లో అరకు కాఫీకి ప్రత్యేకమైన గుర్తింపు ఉందని, ఈ విషయాన్ని ప్రధాని మోదీ సైతం మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రస్తావించినట్లు రామ్మోహన్ నాయుడు స్పీకర్‌కు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని మారుమూల గిరిజన ప్రాంతమైన అరకులోయ ఈ కాఫీ పంటకు ప్రసిద్ది చెందింది. ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంటు సమావేశాలు ముగిసే వరకు అరకు కాఫీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అనుమతించాలని ఏపీకి చెందిన పార్లమెంటు సభ్యులు లోక్‌సభ స్పీకరును కోరారు. ప్రస్తుత సమావేశాలు ముగిసే వరకు అరకు కాఫీ ప్రచార కార్యక్రమం నిర్వహణకు అనుమతి స్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా తెలిపారు. పర్మినెంట్ స్టాల్ ఏర్పాటు విషయాన్ని పరిశీలించి త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు.

చలో పిఠాపురం జనసేన పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - కొయ్యూరు: పిఠాపురం సమీపంలో చిత్రాడలో ఈనెల 14న అట్టహాసంగా నిర్వహించే జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభను జనసైనికులు వీర మహిళలు విజయవంతం చేయాలని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్, మండల గౌరవ అధ్యక్షులు సాగిన బుజ్జిబాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో జనసేన పార్టీ చలో పిఠాపురం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంటు సమన్వయకర్త సాంస్కృతిక కమిటీ సభ్యులు డాక్టర్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా జన సైనికులు, వీర మహిళలు చిత్రాడలో బహిరంగ సభకు 200 మంది కార్లు, బైకు

లు వివిధ రూపాల్లో బయలు దేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గూడెపు శేషుబాబు, మండల మహిళా అధ్యక్షురాలు సేగ్గే భావన, సాయి, జయంతి, మండల క్రియాశీలక సభ్యులు, జివి స్కూల్ చైర్మన్ పేట సుధీర్ బాబు, కాకర కుమారు, రాఘవ, రాజు, బంగారు బాబు, పూర్ర రాజేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

జీసీసీ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిదారి శ్రావణ్ కుమార్

విశాలాంధ్ర - పెదబయలు: జీసీసీ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని, నిత్యవసర సరుకులను సకాలంలో గిరిజనులకు అందించాలని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిదారి శ్రావణ్ కుమార్ సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలో శ్రావణ్ కుమార్ పర్యటించారు. టీడీపీ నాయకులు, జీసీసీ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ముందుగా మోదకొండమ్మ తల్లి ఆలయంలో కొబ్బరి కాయలు కొట్టి దర్శనం చేసుకున్నారు. అనంతరం జీసీసీ గ్యాస్ గొడౌన్ జీసీసీ డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిదారి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం జీసీసీని నిర్వీర్యం చేసిందని కనీసం జీసీసీ డిపో శిధిలావస్థలో ఉన్నా కనీసం పట్టించుకోలేదని అన్నారు. ప్రతి ఒక్క ఉద్యోగి తమ తమ రికార్డులను సక్రమంగా రికార్డ్ చేయాల్సిన బాధ్యత ఉందని, రికార్డులు సక్రమంగా లేకపోతే చర్యలు తప్పవని అన్నారు. అలాగే గిరిజనులకు అందిస్తున్న నిత్యవసర సరుకులు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు శికరి సుకుమారి, వైస్ ఎంపీపీ పాంగి సోనే, స్థానిక ఎంపీటీసీ బొంజుబాబు, మాజీ ఎంపీపీ వెచ్చంగి కొండయ్య, మాజీ సర్పంచ్ త్రినాథ్, అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి బాకూరు వెంకట రమణ రాజు, టీడీపీ డివిజన్ నాయకుడు పాంగి పాండు రంగస్వామి, టిడిపి నాయకులు ఎల్.చిన్ని, ఎస్.కె.అబ్దుల్లా, రామారావు, పృథ్వి, కిషోర్, వెంకటేష్, లైకోన్, జిసిసి డిఎం సింహాచలం, జీసీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని పరామర్శించిన సుభద్ర

విశాలాంధ్ర - ముంచంగిపుట్టు: మండలంలోని కుమడా పంచాయతీ బూరుగుమెట్ట గ్రామానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు బొరగం సోమన్న ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న ఉమ్మడి జిల్లా చైర్పర్సన్ సుభద్ర గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులను ఓదారుస్తూ తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఏ కష్టం వచ్చినా తనను సంప్రదించాలని ఈ సందర్భంగా సుభద్ర సోమన్న కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైసీపీ సీనియర్ నాయకులు మూర్తి, వైసీపీ మండల

అధ్యక్షులు పద్మారావు, ఎంపీటీసీ రాములమ్మ, సుజనకోట సుబ్బలక్ష్మి, జోలపుట్ ఎంపీటీసీ కమల, సర్పంచుల ఫోరం అధ్యక్షులు రమేష్, జోలాపుట్ సర్పంచ్ నీలకంఠం, మాకవరం సర్పంచ్ గంగాధర్, మాజీ సర్పంచ్ జయదేవ్, వైసీపీ మండల కార్యదర్శి రాంప్రసాద్, వైసీపీ సీనియర్ నాయకులు గొల్లోరి సన్యాసి రావు, బూసిపుట్టు మాజీ సర్పంచ్ మంగళన్న, నాయకులు భాస్కర్ ఉన్నారు.

బాల్యలీల జాతరలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

విశాలాంధ్ర - అరకులోయ: మండలంలోని చినలబుడు పంచాయతీ తురాయి గూడ, కరాయిగూడ గ్రామాల మధ్యలో కొలువైయున్న అలేక్ మహిమ ఆలయానికి సంబంధించి గురువారం ప్రారంభమైన బాల్య లీలా జాతర మహోత్సవాల్లో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం పాల్గొన్నారు. జాతర సందర్భంగా జరిగిన సిద్ధి దామోదర్ బాబా టెక్ మందిరం ప్రతిష్ట ఉత్సవం, విశ్వశాంతి బ్రహ్మయజ్ఞం కార్యక్రమాలలో కూడా ఆయన పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహి ంచారు. బాల్య లీల జాతర మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు అలేక్ మహిమ ధర్మ భక్తుల సేవా సంఘం సభ్యులు సామాజిక భవనం నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షులు కమ్మిడి అశోక్, ఒడిశాకు చెందిన రఘునాథ్ బాబా, అవినాష్ బాబా, జస్వంత్ బాబా, భక్తులు సహదేవ్, అర్జున్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పూర్తిచేయాలి

విశాలాంధ్ర - అనంతగిరి: ములియగుడ నుంచి వయా ముస్వంవలస, లింబగుడ, కుమ్మరివలస, టోకూరు వరకు బీటీ రోడ్డు పూర్తి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కిల్లో మోస్య డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా కిల్లో మోస్య ఆయా గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీటీ రోడ్డు పనులు పూర్తి చేయాలని నిరసన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 సంవత్సరంలో ములియగుడ నుండి వయా ముస్వంవలస, లింబగుడ, కుమ్మరివలస, టోకూరు వరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి సహకారంతో బీటీ రోడ్డు మంజూరు అయిందని సుమారు 6 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ రోడ్డు పనులు పూర్తి కాలేదని తెలిపారు. అధికారులు కాంట్రాక్టర్లకు లాభం కోసం పనిచేస్తున్నారని ప్రజల కోసం కాదని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి సమర్థి నాగేశ్వరరావు, కిల్లో దొన్ను, సమర్థి నందు, రఘు, గోపాల్ రాజు, పొత్తి డొంబు, రాము, గోపి తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మాన్ గృహ నిర్మాణానికి రూ.10 లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర - దుంబ్రిగూడ: ప్రధానమంత్రి జన్‌మాన్ పథకం ద్వారా గృహాలు నిర్మించుకుంటున్న పీవీటీజీలకు హౌసింగ్ యూనిట్ ఖరీదు 10లక్షలు ఇవ్వాలని సిపిఎం మండల నాయకులు, గసభ మాజీ సర్పంచ్ పాంగి సురేష్ కుమార్, మండల నాయకులు పాంగి సత్యనారాయణలు డిమాండ్ చేశారు. దుంబ్రిగుడ మండలం గసభ గ్రామ పంచాయతీ, కూడ గ్రామంలో సిపిఎం పార్టీ పిలుపు మేరకు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం ఆ పంచాయతీ గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు గృహ నిర్మాణానికి సంబంధించి ముడి సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయిన పరిస్థితులో గృహాల యూనిట్ ఖరీదు ప్రభుత్వం పెంచాలని వారు చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న నిధులు సరిపోవడం లేదని దీని కారణంగా గృహాలు అసంతృప్తిగా మిగిలిపోయే పరిస్థితి ఏర్పడుతుందని వారు అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆ గ్రామ గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర - కొయ్యూరు: పదవ తరగతి పరీక్షలు రాసే విద్యార్థినీ విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని మంచి సహృదయంతో ఉచితంగా అందించేందుకు డౌనూరు ప్రాంతానికి చెందిన యువకుడు సురేష్ పట్నాయక్ ముందుకు రావడం అభినందనీయమని టీడీపీ మండల మహిళ అధ్యక్షురాలు బోనంగి సత్యవతి తెలిపారు. గురువారం మండలంలో డౌనూరు పంచాయతీ ధర్మవరం, చిట్టింపాడు గ్రామాల్లో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందించారు. ఈ సందర్భంగా బోనంగి సత్యవతి సురేష్ పట్నాయక్ మాట్లాడుతూ టెన్త్ క్లాస్ పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు.

నిరుద్యోగులను మోసం చేసిన వైసీపీ

విశాలాంధ్ర - జి.మాడుగుల: ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందని రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు సోమెలి చిట్టిబాబు, తెలుగు యువత అధ్యక్షులు కొండలరావు, రైతు విభాగ అధ్యక్షులు బాబురావు, సింహాచలం అన్నారు. నిరుద్యోగులను నిలువునా మోసగించి ఇప్పుడు యువత పోరు అంటూ ధర్నాలు చేయడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం ఈనెలలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తుందని, జూన్‌లో నియామకాలు పూర్తి చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమనేది వైసీపీ నాయకులు గమనించాలని హితవు పలికారు.

ఉన్నత విద్య వైపు అడుగులు వేయండి

విశాలాంధ్ర - చింతపల్లి: సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యతోనే విద్యను ఆపకుండా ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఆత్మీయ వీడ్కోలు వేడుకలు చింతపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సేంద్రీయ వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి మాట్లాడుతూ విద్యార్థులు పాలిటెక్నిక్ విద్యతోనే ఆగిపోకుండా ఉన్నత విద్య అయిన %శాస్త్ర. దీం%., సీట్లు సాధించాలని సూచించారు. ఈ

కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డా. కె.బయ్యపు రెడ్డి, డా. పి. బాల హంస్సేన్ రెడ్డి., బి.ఎస్.సందీప్ నాయక్., వార్డెన్ జోగారావు., పాలిటెక్నిక్ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

జంఝావతి సమస్యపై అసెంబ్లీలో ప్రస్తావించాలి: సీపీఐ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: జంఝావతి ప్రాజెక్టు సమస్యను ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఉమ్మడి జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రస్తావించి సమస్య పరిష్కరించే విధంగా ప్రయత్నం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న కోరారు. పట్టణంలో ఉన్న పార్టీ కార్యాలయంలో జరిగిన పత్రికా సమావేశంలో మాట్లాడుతూ కొమరాడ మండలం రాజ్యలక్ష్మీపురం వద్ద జంఝావతి నదికి ఉపనదిగా రిజర్వాయరు ఏర్పాటు చేయాలని, రిజర్వాయర్ నిర్మాణం పూర్తికావాలంటే ఒడిసా రాష్ట్రంతో ఉన్న సమస్య పరిష్కారం కావాలన్నారు. ఈ రిజర్వాయరు నిర్మాణం వల్ల ఒడిసాలో 1175 ఎకరాలు ముంపునకు గురవ్వడంతోపాటు సుమారు 250 కుటుంబాలు నిర్వాసితులవు తాయన్నారు. అసంపూర్తిగా నిలిచిన జంఝావతి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేయడానికి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు కేంద్రమంత్రి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, ఎమ్మెల్యే చిరంజీవులు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఇంజినీరింగ్ అధికారులతో కూడిన బృందం 2015 అక్టోబరు 9న భువనేశ్వర్‌లో ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో సమావేశమయిందని, దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జంఝావతి ప్రాజెక్టుకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారన్నారు. జంఝావతి ప్రాజెక్టు పనులు చేసేందుకు ప్రభుత్వం రూ.39 కోట్లు నిధులు విడుదల చేస్తూ 2016 జూన్ 29న ప్రభుత్వ ఉత్తర్వును విడుదల చేస్తూ నిధులు విడుదల చేసిందన్నారు.ఇరురాష్ట్ర ప్రభుత్వాలు కూర్చొని జంఝావతి సమస్యపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, పార్టీ సీనియర్ నాయకులు బొత్స మోహన్‌రావు, జిల్లా సమితి సభ్యులు బిటి నాయుడు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం విజయవంతం

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్స్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్, పట్టాసి చలపతిరావు పర్యవేక్షణలో గురువారం బ్లడ్ డొనేషన్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల, మహిళా కళాశాల ప్రిన్సిపాల్స్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ రక్తదానం మరొకరికి ప్రాణదానమని ఇటువంటి కార్యక్రమం తమ కళాశాలల ప్రాంగణంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలు మరెన్నో నిర్వహించి ప్రాణాప్రాయంలో ఉన్నవారికి అవసరమైన రక్తాన్ని అందించే విధంగా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ మెగా బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో ఎకనామిక్స్ అధ్యాపకులు డాక్టర్ కె.లక్ష్మి, సీనియర్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని రక్తదానం చేయడం జరిగింది. రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత కుమార్ నాయక్, పట్టాసి చలపతిరావు అభినందనలు తెలియజేశారు.

16న అవగాహన సదస్సు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఈ నెల 16వ తేదీ ఆదివారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో జిల్లాలోని పీహెచ్పీ సభ్యులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరుగుతుందని ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగిరెడ్డి సింహాచలం, నడిమింటి గోపాలనాయుడు తెలిపారు. ఈ అవగాహన సమావేశానికి బొబ్బిలి పట్టణానికి చెందిన ప్రముఖ న్యూరో వైద్యులు రెడ్డి శంకరరావు హాజరై పిహెచ్పి సభ్యులకు న్యూరో వ్యాధుల పట్ల అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. కావున జిల్లాలోని పీహెచ్పీ సభ్యులు సకాలంలో ఈ సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

శిశు మరణాలపై సమగ్ర సమీక్ష

విశాలాంధ్ర - చింతూరు: డిప్యూటీ డియం అండ్ హెచ్ఓ డాక్టర్ పుల్లయ్య మార్గదర్శకత్వంలో తులసిపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కల్లేరు, చదలవాడ గ్రామాల్లో బృందం సందర్శించింది. తల్లిదండ్రులను, ఫీల్డ్ సిబ్బందిని విచారించారు. శిశు మరణాల కారణాలను విశ్లేశించి, తగిన నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పరిశీలనలో తగిన వైద్యం, పోషణ, మాత శిశు సంరక్షణ, అవగాహన కార్యక్రమాలు బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు ఐటీడీఏ పీఓ అపూర్వ భరత్, ప్రత్యేక వైద్య నిపుణులు కాకినాడ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్‌లు జ్ఞాన సురేష్ కుమార్, సిహెచ్.గోపిచంద్, జి.సర్వేశ్వర్రావు, ఏ. శ్రావణి, యం.రాజేష్, కె.శ్రీకాంత్ రెడ్డి, తులసిపాక డాక్టర్ ఉదయ్ కుమార్ రెడ్డి, డాక్టర్ నిఖిల్ పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి
ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలను సాధించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. పార్వతీపురం మండలం రావికోనలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను పీఓ బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఆ పరీక్షలకు విద్యార్థులు మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు పొందాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఇష్టంగా చదవాలని, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని అన్నారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ఎటువంటి ఒత్తిడిలకు గురికావద్దని హితవు పలికారు. అనంతరం స్టడీ అవర్ లో ఉన్న విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించి, టెన్త్ లో మంచి విజయం సాధించాలని విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఈ పర్యటనలో ఆశ్రమ ఉన్నత పాఠశాల వార్డెన్, విద్యార్థులు ఉన్నారు.

సంస్కృతాన్ని నేర్చుకోండి: కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: సంస్కృతిని నేర్చుకోండి-వివేకానందుని వారసులు కండని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ సంస్కృత ఉన్నత పాఠశాలలో గురువారం స్వామి వివేకానంద విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ ఏ.శ్యాం ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంస్కృత భాష చాలా గొప్పదని, భాషను నిలుపుకోవలసిన అవసరం జాతికి ఎంతైనా ఉందని అన్నారు. స్వామి వివేకానందుని బోధనలు ప్రతివారూ ఆచరించ దగ్గవన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సంస్కృత భాషలో పిల్లలు మాట్లాడగా మురిసిపోయారు. పలు శ్లోకాలను విద్యార్థులు చదవగా వారిని అభినందించారు. 10వ తరగతి విద్యార్థులకు వాసవి మాత దీవెనగా క్లబ్ కోశాధికారి వరద ఉదయ్ కుమార్ సమకూర్చిన అట్టలను, పెన్నులను, స్కేళ్ళను, పెన్సిల్లను కలెక్టర్ విద్యార్థులకు అందజేశారు. లైన్స్ క్లబ్ అధ్యక్షులు బిఎస్‌బి రావు 12 కుర్చీలను కలెక్టర్ ద్వారా పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.తిరు పతినాయుడు, మండల విద్యాశాఖా ధికారులు వై.విమలకుమారి, కె.ప్రసాదరావు, జిల్లా రెడ్ క్రాస్ సంస్థ అధ్యక్షుడు ఎం.శ్రీరాములు, పాఠశాల హెచ్ఎం గోర్ల హేమ సుందరావునాయుడు తదితరులు పాల్గొన్నారు. అనుసంధానకర్త, సంస్కృత పండితులు జె.బి.తిరుమలాచార్యులు ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆనందోత్సాహాల నడుమ ఈ కార్యక్రమం దిగ్విజయంగా ముగిసింది.

గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

విశాలాంధ్ర - చింతపల్లి: రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి శాసనసభ సాక్షిగా చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి అన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి గిరిజన చట్టాలను అవమానించే విధంగా గిరిజన ప్రాంతంలో గిరిజనేతరలకు పక్కా గృహాలు మంజూరు చేయాలని శాసనసభ సాక్షిగా మాట్లాడడం చాలా బాధాకరమని, ఆమె మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని, లేకుంటే గిరిజన ఆగ్రహానికి గురికాక తప్పదని గిరిజన సంఘం మండల ప్రధాన కార్యదర్శి సాగిన చిరంజీవి హెచ్చరించారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఐదవ షెడ్యూల్ ప్రాంతంలో అంగన్వాడి కార్యకర్తగా పనిచేస్తూ రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన గిరిజన ఎమ్మెల్యే గిరిజన ప్రాంతంలో జీవనం సాగిస్తున్న గిరిజనేతరులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని అసెంబ్లీలో మాట్లాడడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు వంతల గురుమూర్తి,.పాంగి చిట్టి బాబు, పాంగి జోగిరాజు,. వంతల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ

విశాలాంధ్ర - పార్వతీపురం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను, పరీక్షాకేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన బందోబస్తును జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రాల చుట్టూ వున్న పరిసరాలను, తీసుకున్న భద్రతా చర్యలు, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ఎటువంటి విమర్శలకు తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించడానికి పకడ్బందీ చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పరీక్ష జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్స్, ఇతర అధికారులు అనుసరించవలసిన నిబంధనల పై పలు సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో బయట వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు ఉండరాదన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరు గుంపులుగా ఉండకూడదన్నారు.

కవయిత్రి మొల్ల రచనలు ఆదర్శనీయం

విశాలాంధ్ర - పార్వతీపురం : కవయిత్రి మొల్లమాంబ రచించిన రచనలు అందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. వాల్మీకి రామాయణాన్ని పామరులకు సైతం అర్థమయ్యేలా తెలుగు భాషలోకి అనువదించిన తొలితెలుగు కవయిత్రి మొల్లని గుర్తుచేశారు. మహిళలు ఇంటికే పరిమితమైన ఆ రోజుల్లో ధైర్యంగా రచనలు చేశారని, ఆమె చేసిన సేవలకు గుర్తుగా మొల్లమాంబ జయంతిని రాష్ట్ర పండుగల ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలను బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈకార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మొల్ల చిత్ర పటానికి పూలమాలనువేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాల్మీకి మహర్షి రామాయణాన్ని సంస్కృత భాషలో 24 వేల పద్యాలుగా రచిస్తే, దాన్ని 671 పద్యాలుగా అందరికీ అర్థమయ్యేలా సరళమైన తెలుగు భాషలో రచించిన ఘనత ఆమెదని కొనియాడారు. రామాయణం పూర్తిగా ఆమె చేతుల మీదనే రచింపబడడం విశేషమని అన్నారు. తెలుగు మాటల మధ్య మృధు మధురమైన రసస్ఫూర్తితో చమత్కార భరితంగా రచించిన ఘనత ఆమెదని తెలిపారు. శ్రీకృష్ణదేవరాయలు సైతం తన ఆస్థానానికి ఆమెను పిలిపించి, ఆ మహా గ్రంథం గురించి తెలుసుకోవడమే కాక, అష్టదిగ్గజాలను సైతం ఆమె మెప్పించినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ,సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, కెఆర్ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మ చంద్రారెడ్డి, జిల్లా బిసి సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా శాలివాహన సంఘ అధ్యక్షులు కొత్తూరు శంకరరావు, కార్యదర్శి ఉరిటి యాదవ్, తెప్పల శ్రీను, ఉరిటి సింహాచలం, ఉరిటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పీఎం జన్‌మాన్ లబ్ధిదారులకి రూ.10 లక్షలు ఇవ్వాలి

విశాలాంధ్ర - చింతపల్లి: ప్రధానమంత్రి జన్మన్ యోజన ఇళ్ల నిర్మాణానికి 10 లక్షలు ఇవ్వాలని, మారుమూల గిరిజన ప్రాంతాల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు తక్షణమే చర్యలు చేపట్టాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి పాంగి ధనంజయ్ అన్నారు. గురువారం ఆ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని తాజంగి 2వ సచివాలయం పరిధి గ్రామాల సమస్యలపై ఆయా గ్రామాల ప్రజలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిటీజీలకు ప్రత్యేకంగా ఇస్తున్న ప్రధానమంత్రి జన్‌మాన్ యోజన ఇళ్ల నిర్మాణానికి మూడు లక్షల ముప్పై తొమ్మిది వేలు ఇస్తే పావు శాతం ఇల్లు పనికూడా అవ్వదని 17/18, అంటే సుమారుగా 340 చదరపు అడుగుల వైశాల్యం గల ఇళ్ళ నిర్మాణానికి 10 లక్షల రూపాయలు ఖర్చు పెడితే తప్ప లబ్ధిదారులకు అనుకూలమైన ఇళ్ల నిర్మాణం పూర్తి అవ్వదని, ఇంజినీర్లే అంచనా వేస్తున్నారని, అలాంటిది ప్రభుత్వం అరకొరగా ఇస్తున్న డబ్బులకు ఆశపడి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణానికి పూనుకున్నాడు అంటే అప్పుల పాలు అవ్వక తప్పదని, ఇది సరైన విధానం కాదన్నారు. ఇళ్ల నిర్మాణానికి 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిసా కమిటీ అధ్యక్షుడు జి.కొండబాబు, ఆయా గ్రామాల పెద్దలు కే.రాజారావు, సుమన్, సత్యనారాయణ, వి.సత్తిబాబు పాల్గొన్నారు.

లక్ష్మినరసింహ ఆలయంలో భక్తుల ప్రదక్షిణలు

విశాలాంధ్ర - సీతానగరం: ఓంనమో శ్రీలక్ష్మినరసింహస్వామినేనమః, ఓం నమో నారాయణాయనమః, ఓం గోవిందాయనమః, ఓం శ్రీవేణుగోపాలస్వామినేనమః అంటూ భక్తుల నామస్మరణతో శ్రీ లక్ష్మినరసింహ స్వామిఆలయం గురువారం మార్మోగింది. ప్రతీ గురువారం వందలాదిమంది భక్తులు వేకువజామునుండి సాయంత్రంవరకు మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నిర్వహించేముడుపుల పూజలకు వచ్చి భక్తిశ్రద్ధలతో పూజలను చేస్తున్నారు. ఆలయ ప్రధానఅర్చకులు పీసపాటిశ్రీనివాసాచార్యులు, పీసపాటి రామానుజాచార్యులు టిటిడి పారాయణ కర్త కె.శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో ఈ పూజలను నిర్వహిస్తున్నారు. భక్తులు తెచ్చిన వివిధరకాల పూలదండలు, పూలు, కొబ్బరి కాయలు అరటిపళ్లు, కుంకుమ, పసుపుతో స్వామివారి ప్రధానగుడి కళకళలాడుతుంది. ప్రతీగురువారం శ్రీలక్ష్మి నరసింహస్వామీ దేవాలయంలో జరుగుతున్న ఈ ముడుపుల పూజలకు పాత భక్తులతోపాటు కొత్త భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది. గురువారం జరిగిన ముడుపుల పూజలకు జిల్లా కలెక్టర్ సతీమణి, పలువురు జిల్లా, మండల అధికారులు,ఆలయధర్మకర్త చెలికాని వెంకటగోపాలకృష్ణ భారతిదంపతులు, భక్తులు విచ్చేసి పూజలో పాల్గొన్నారు. ఆలయ ప్రధానఅర్చకులతో పాటు పవన్ ఆచార్యులు, మురారి, మనోజ్ ఆచార్యులు, కృష్ణమోహన్ ఆచార్యులు, దగ్గరుండి పూజలు చేయించడంతోపాటు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేస్తున్నారు.

కిడ్నీ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర - చింతూరు: ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని అపోలో డయాలసిస్ క్లినిక్స్ ఆధ్వర్యంలో మూత్రపిండాల ఆరోగ్యం, ముందస్తు గుర్తింపు ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని చింతూరు మండలం కుమ్మూరు గ్రామంలో నిర్వహించారు. మీ మూత్రపిండాలు బాగున్నాయా? ముందుగానే పరీక్షించుకోండి - ఆరోగ్యాన్ని కాపాడుకోండి అనే థీమ్‌తో హెల్త్ క్యాంపులు, ఆరోగ్య చర్చలు కార్యక్రమాలను నిర్వహించారు. "మూత్రపిండ వ్యాధుల నుండి ప్రజలను రక్షించడానికి ముందస్తు పరీక్షలు చాలా అవసరం అన్నారు. కిడ్నీ ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు మేము ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అపోలో డయాలసిస్ క్లినిక్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుధాకరరావు, రాష్ట్ర ప్రభుత్వ సంబంధాలు, కార్యకలాపాలు, వ్యాపార అభివృద్ధి మేనేజర్ మధు కిరణ్ వంటిపల్లి, డయాలసిస్ క్లినిక్ మేనేజర్ అభిరామ్, డిప్యూటీ డి యం అండ్ హెచ్ఓ పి.పుల్లయ్య, మెడికల్ సూపరింటెండెంట్ డా కోటిరెడ్డి, గ్రామ సర్పంచ్ ముచ్చిక నాగార్జున, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెండు మాధ్యమాల్లోనూ బోధన సాగించాలి

విశాలాంధ్ర - బెలగాం : విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శాసనమండలిలో మాట్లాడుతూ ఏ ఒక్క పాఠశాలను మూసే ప్రసక్తి లేదని తెలపడం ఆనందాన్నిచ్చిందని పిఆర్టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరపు సూర్యనారాయణ తెలిపారు. 117 జీవోను రద్దు చేసి దాని స్థానంలో రాబోయే జీవో అంతకంటే దారుణంగా ఉన్నట్లు మేము భావిస్తున్నామని దానివలన ఉన్నత పాఠశాలలో అనేక పోస్టులు కనుమరుగయ్యే పరిస్థితి వచ్చిందని సూర్యనారాయణ వాపోయారు. ప్రతి శుక్రవారం మేము ఇచ్చిన సూచనలను పక్కనపెట్టి అధికారులు వారికి తోచిన విధంగా నిబంధనలు పెట్టడం సరికాదని సూర్యనారాయణ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం కావాలంటే సంఘ నాయకులు ఎమ్మెల్సీలతో సమావేశం ఏర్పాటు చేసిన తరువాత మాత్రమే అమలు చేయాలని సూర్యనారాయణ సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 365మంది గైర్హాజరు
జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి మంజులవీణ

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం రసాయనశాస్త్రం, వాణిజ్య శాస్త్రం పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి డి.మంజులవీణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు సంబంధించి జిల్లాలోసాధారణ కోర్సుల విద్యార్థులు 171మంది, ఒకేషనల్ విద్యార్థులు 194 మంది గైర్హాజరయినట్లు తెలిపారు. తనతోపాటు జిల్లా ఎగ్జామినేషన్ కమిటీతోపాటు రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పర్యవేక్షణ చేసాయన్నారు. 461 సీసీకెమెరాలు పర్యవేక్షణలో ఈ పరీక్షలను జిల్లా ఎగ్జామినేషన్ కంట్రోల్ రూమ్, రాష్ట్ర ఎగ్జామినేషన్ కంట్రోల్ రూములు పర్యవేక్షణ చేశాయన్నారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగలేదని తెలిపారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలి

విశాలాంధ్ర - అనంతగిరి: అనంతగిరి మండలం మారుమూల పెదకోట పంచాయితీ రేగులపాలేం, కొండిభకోట, టముటు, చింతలపాలెం గ్రామాల్లో పర్యటించి హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు రద్దు చేయాలని కేబినెట్ నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని సిపిఎం పార్టీ జనచైతన్య యాత్రలో ప్రభావిత ప్రాంతాల్లో పాదయాత్ర చేస్తున్న అనంతగిరి జడ్పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జనచైతన్య యాత్రలో భాగంగా ఆయా గ్రామాల ప్రజలతో జడ్పీటీసీ దీసరి గంగరాజు కలిసి వారి గ్రామాల్లో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రేగులపాలేం, కొండిభకోట, టముటు, చింతలపాలేం, బిల్లకంభ, కుడియా గ్రామాల్లో సుమారు 850 మంది గిరిజన జనాభా ఉన్నారని గ్రామాలు, భూములు ప్రత్యక్షంగా నష్టపోతున్నారన్నారు. ఈ నెల 17న అనంతగిరిలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పీసా కమిటీ ఉపాధ్యక్షుడు నారంగి సింహాచలం, కార్యదర్శి గొల్లోరి ఆనంద్, వార్డు మెంబర్ గొల్లోరి గోవింద్, సప్పి దేముడు, జన్ని ఈశ్వరరావు, సోమేల దేముడు, కురిసేల ఈశ్వరరావు, గుంట గోవింద్, పాతునీ సన్యాసమ్మ, గొల్లోరి ఆదామ్మ, సీదరి గంగమ్మ, సిపిఎం పార్టీ నాయకులు పాంగి మోహన్, జన్ని సింహాద్రి, నరాజీ సురేస్ బాబు ప్రజలు పాల్గొన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కి వినతి

విశాలాంధ్ర - ఎటపాక: మండల సమస్యలపై పాడేరు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కి అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి మువ్వా శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండల సమస్యలపై అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి మువ్వా శ్రీనివాస్ నాయకత్వంలో టీడీపీ నాయకులు జిల్లా ఇన్‌చార్జి గుమ్మడి సంధ్యారాణిని కలిసి శాలువాతో సన్మానించారు. ఆమె వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌కి సమస్యలను వివరించారు. ఎటపాక పంచాయతీలో పరిధిలో వున్నా రాజు పేట, పురుషోత్త పట్నం, శ్రీ రామ్ నగర్ కాలనీలలో గల విద్యుత్, సమస్య, మండలంలో వున్న గ్రామీణ రహదారుల సమస్య, త్రాగు నీటి సమస్య, గిరిజనుల కోసం వ్యవసాయ బోర్లు, మోటార్‌ల సమస్య, చదువుకొనే విద్యార్థుల కొరకు పాఠశాలలు, కళాశాలల ఏర్పాటు, వైద్య సౌకర్యంపై వినతి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గుడేటి రవికుమార్, ఎటపాక గ్రామపంచాయతీ సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు పసుపు లేటి రాంబాబు, తోట రమేష్ పాల్గొన్నారు.

పశువులను రోడ్లపైకి వదలొద్దు

విశాలాంధ్ర - రాజవొమ్మంగి: పంటకాలం ముగిసిన వెంటనే రైతులు పశువులను వదిలి వేయడంతో అవి హైవే రోడ్డుమీదే ఉంటున్నాయని, దాని వలన వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని రాజవొమ్మంగి సర్పంచ్ గొల్లపూడి రమణి అన్నారు. ఈ పశువులు రాత్రుళ్ళు రోడ్లమీదే ఉండడం వలన శివరాత్రి పండుగ సమయంలో అనేక మంది మోటార్ సైకిల్ నడిపే వ్యక్తులు చాలా మంది ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు. ఇకనైనా పశువుల యజమానులు స్పందించి తమ పశువులను తోలుకెళ్లాలని, లేని పక్షంలో సోమవారం నుండి రోడ్లపై ఉన్న పశువులను గోశాలకు తరలిస్తామని లేదా ఎవరికైనా పెంచుకునేందుకు కావాలంటే వారికి అప్ప చెబుతామని తెలిపారు.

నేడు వెంకటేశ్వరుని కళ్యాణం

విశాలాంధ్ర - ఎటపాక: ఎటపాక మండలం వెంకటరెడ్డి పేటలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర ఆలయం వద్ద వేంకటేశ్వరుని తిరు కళ్యాణ మహోత్సవం జరుగనుంది. కళ్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశారు. కళ్యాణ మండపం పువ్వులతో అలంకరించారు. విద్యుత్ దీపాలు, చలువ పందిళ్ళు, మంచినీటి సౌకర్యం, అన్నదన కార్యక్రమంతోపాటు ఆలయం వద్ద పోలిస్ బందోబస్తు ఏర్పాటుచేశారు. కళ్యాణానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా స్వామి వారి కల్యాణాన్ని తిలకించ వచ్చని అలయ కమిటీ వారు తెలియజేశారు. గురువారం ఆలయంలో వెంకటేశ్వర స్వామివారిని పెళ్ళికి కుమారుడిగా తీర్చి దిద్దారు. భక్తులు అధికంగా పాల్గొన్నారు.

నిర్వాసితుల పక్షానే సీపీఎం

విశాలాంధ్ర - కూనవరం: అధికారం కోసం కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారం చేజిక్కించుకున్నాక ఐదేళ్లపాటు కాలయాపన చేయడం గత ప్రభుత్వాలకి అలవాటైపోయిందని కానీ అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ నిర్వాసితుల న్యాయమైన హక్కుల కోసం పోరాడేది ఎర్రజెండా మాత్రమేనని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఉద్ఘాటించారు. గురువారం పోలవరం ముంపు మండలాలలో పర్యటించిన ఆయన కూనవరంలోని గిన్నెల బజార్లో ముంపు బాధితులతో మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు వల్ల ప్రతి ఏడాది మునుగుతూ నరక యాతన పడుతున్నామని అక్కడ ప్రజలు ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నమ్ రాజులు, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, ఎంపీటీసీ జయసుధ, సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, వి.ఆర్ పురం మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, కర్నాటి శ్రీనివాసరావు, తాళ్లూరి శ్రీనివాసరావు, గడ్డిపాటి షణ్ముకేశ్వరావు, ధర్మయ్య మడెం బాబు, తమ్మయ్య, సుమన్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు ఎస్పీ హోలీ శుభాకాంక్షలు

విశాలాంధ్ర - పార్వతీపురం: హోలీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు, పోలిస్ అధికారులకు,మీడియా మిత్రులకు సిబ్బందికి హోలీ పండగ శుభాకాంక్షలు తెలియ జేస్తున్నట్లు జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి తెలిపారు. కులాలు, మతాలు, ప్రాంతాలు అనే తేడా లేకుండా నిర్వహించుకునే పండగల్లో హోలీ పండుగ ఒకటన్నారు. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా అందరూ ఒకటే అనే భావనతో, అందరూ రంగులు అద్దుకొని ఆనందంగా ప్రశాంత వాతావరణంలో హెూలీ పండుగ జరుపుకోవాలని సూచించారు. ఎవరైనా రోడ్లమీద వెళ్లేవారిపై, ఇతరులపై బలవంతంగా రంగులు చల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా, హెూలీపండుగ ముసుగులో అసాంఘిక కార్యక్రమాలు చేపడితే అలాంటివారిపై కఠినమైన చర్యలు ఉంటాయన్నారు.

నాటుసారారహిత జిల్లాగా పార్వతీపురంను తీర్చిదిద్దుతాం

కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం: నవోదయ 2.0 కింద నాటుసారా రహిత జిల్లాగా పార్వతీపురం జిల్లాను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధశాఖల అధికారులతో నవోదయ 2.0 కార్యక్రమంపై జిల్లా సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా నవోదయ 2.0 ప్రచారరథంను, కరపత్రాలు, గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లాలో 137 గ్రామాలను ఏ,బి,సి గ్రామాలుగా వర్గీకరించి సదరు గ్రామాలకు దత్తత అధికారులను నియమించడం జరిగిందన్నారు. నాటుసారా సంబంధిత పిర్యాదులు కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14405 పై విస్తృత ప్రచారం చేయాలన్నారు. గోడ పత్రికలు, కరపత్రాల ద్వారా ప్రచారం చేపట్టాలని సూచించారు. 1,265 పాత నేరచరిత్ర కల్గిన వ్యక్తులను గుర్తించి, వారిలో 191మందిని బైండోవర్ చేసిన విషయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సెక్షన్ 129/బి.ఎన్.యస్.యస్ ప్రకారం తదుపరి బైండోవర్ పెద్ద ఎత్తున చేపట్టాలని, బ్రీచ్ నగదుతక్కువలో 50వేల రూపాయలు కట్టించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. పోలీసు శాఖాధికారులు నాటుసారా గ్రామాలను దత్తత తీసుకోవాలని, పోలీసు మరియు ఎక్సైజ్ అధికారులు సమన్వయంగా విస్తృత దాడులుచేయాలని ఆదేశించారు. అంతరాష్ట్ర సమన్వయ సమావేశాలు కూడా ఏర్పాటుచేయాలని, డ్రోన్లను ఉపయోగించి నాటుసారా తయారీ కేంద్రాల సమాచారం సేకరించి, పటిష్ట నిఘా ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈసందర్భంగా పార్వతీపురం మున్సిపాలిటీ ఇందిర కాలనీలో ఎక్సైజ్ శాఖ నవోదయ 2.0 ప్రచారరథంతో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాన్ని, ర్యాలీని ఎక్సైజ్, పోలీస్ శాఖలు సంయుక్తంగా చేపట్టాయి. తొలుత కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నవోదయం 2.0 ప్రచార వాహనానికి జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ అంకిత సురాన, ప్రాజెక్టు అధికారి అశుతోష్ శ్రీ వాస్తవ,అసిస్టెంట్ కమిషనర్ వి.రామచంద్రరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాధుడు, జిల్లా విద్యా శాఖాధికారి ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎస్.భాస్కరరావు, గిరిజన సంక్షేమ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిషోర్,ఎక్సైజ్ ఇనస్పెక్టర్లు, ఎస్ఐలు,దత్తత అధికారులు, ఎక్సైజ్ పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో డయాగ్నోస్టిక్ సేవలు కీలకం

విశాలాంధ్ర - బెలగాం : ల్యాబ్ టెక్నీషియన్స్ డే సందర్భంగా బుధవారం స్థానిక ఎన్జీఓ హోంలో పార్వతీపురం మన్యం జిల్లా లాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా డిఎం అండ్ హెచ్ఓ ఎస్. భాస్కరరావు, ఎపి ఎన్జీఓ పార్వతీపురం జిల్లా శాఖ అధ్యక్షులు జివిఆర్ఎస్ కిషోర్, లాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు యాండ్రాపు తిరుపతిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు తిరుపతిరావు సమావేశంలో మాట్లాడుతూ దశాబ్దాల తరబడి ల్యాబ్ టెక్నిషియన్స్ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అన్ని విభాగాల్లో కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్స్ కు సమానపనికి సమాన వేతనం 100% గ్రాస్ వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కొనసాగించాలని, ల్యాబ్ టెక్నీషియన్స్ కు ప్రమోషన్ చానల్ ఇవ్వాలని, జోనల్ క్యాడర్‌గా మార్పు చేయాలని, క్యాడర్ పేరు మార్పు చేయాలని, అన్ని పిహెచ్సీలలో 2వ లాబ్ టెక్నిషియన్ పోస్ట్ మంజూరు చేయాలన్నారు. కేవలం పరీక్షా ఫలితాన్ని బట్టే వైద్యులు చికిత్స అందిస్తారని, ఇంతటి ప్రాధాన్యం ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ క్యాడర్ విషయంలో ప్రభుత్వాలు సమస్యల పరిష్కార విషయంలో చొరవ చూపలేదని, ఈ ప్రభావం తప్పక ప్రజారోగ్యం మీద ఉంటుందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో ఉద్యోగంలో ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2గా చేరి ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2గానే రిటైర్ అవుతున్నారని అంటే అది క్యాడర్‌కే కాదు వైద్య ఆరోగ్య శాఖ వ్యవస్థకు సిగ్గుచేటని వాపోయారు. వైద్య ఆరోగ్య శాఖలో వివిధ విభాగాల్లో పనిచేసే కాంట్రాక్ట్ ల్యాబ్ టెక్నీషియన్స్ కు సమాన పనికి సమాన వేతనం వర్తింప చేయాలని, ఎన్నికల కోడ్ వలన కొంతమంది కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఆర్డర్లు ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉన్నాయని వాటికి వెంటనే ఆర్డర్స్ ఇప్పించాలని డిమా ండ్ చేశారు. అలాగే ఎపివివిపి/ డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ లో నిలుపుదల చేసిన కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కొనసాగిస్తూ మిగిలి ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఆర్.సురేష్, కోశా ధికారి కె.కిషోర్, అసోసియేట్ అధ్యక్షులు ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యువజన పోరుపై ఆరోపణలు తగదు: మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

విశాలాంధ్ర - చింతపల్లి: వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నిర్వహించిన యువజన పోరు కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో ఉన్న నాయకులు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆ పార్టీ పాడేరు మాజీ శాసన సభ్యురాలు, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొత్తగుళ్ళి భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం చింతపల్లి వచ్చిన ఆమె స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, సర్పంచ్ దురియా పుష్పలతలతో కలిసి మాట్లాడుతూ 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న తెదేపా ఎన్నికల సమయంలో భాగంగా ఇచ్చిన హామీలలో భాగంగా ఇంటికొక ఉద్యోగం ఇస్తామని, ఉద్యోగం ఇవ్వలేని పక్షాన నిరుద్యోగ భృతి 3000 ఇస్తామన్న హామీని అమలు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. మొన్నటి ఎన్నికల్లోను అదే హామీని ఇచ్చిన కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే ఈ ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పడాన్ని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేశారు. 2024 జూన్ లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కొలువు తీరి దాదాపు ఏడాది కావస్తుందన్నా ఇచ్చిన హామీ ప్రకారం నాలుగు లక్షల ఉద్యోగాలు ఇవ్వవలసినప్పటికీ వాటిని విస్మరించి ఈ ప్రభుత్వం యువతను నిలువునా మోసగించిందని ఆమె విమర్శించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పూర్తిగా విద్యా వ్యవస్థను సర్వనాశనం చేశారని ఆమె విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటయిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని చెప్పిన ఈ సర్కారు నేటి వరకు నోటిఫికేషన్ ఇవ్వకుండా తాత్సారం చేస్తుందన్నారు అదే క్రమంలో జీవో నెంబర్ 3 ని పునరుద్ధరించి అప్పుడు నోటిఫికేషన్ విడుదల చేయాలని లేకుంటే గిరిజనులకు నష్టం జరిగే ప్రమాదం ఉందని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. గిరిజనులకు న్యాయం చేయాలన్న ఆలోచన ఉంటే తప్పకుండా జీవో నెంబర్ 3 పునరుద్ధరించిన తరువాతే నోటిఫికేషన్ ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నాజర్ వల్లి తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల వెనుకబాటుతనం ఎమ్మెల్యేకు కనిపించడం లేదా...

విశాలాంధ్ర - వై.రామవరం: రంపచోడవరం ఎంఎల్ఏ మిరియాల శిరీష దేవి అసెంబ్లీ లో ఏజెన్సీ లోని గిరిజనేతరుల ఇళ్ల నిర్మాణాలు కోసం మాట్లాడిన తీరు ఆదివాసీలను అవమానించడమేనని ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వెదుళ్ల లచ్చి రెడ్డి,ఇతర నాయకులు దుయ్యబట్టారు.గురువారం తోటకూర పాలెం లో సమావేశం లో మాట్లాడారు.గిరిజన ప్రాంతాలలో విద్య,వైద్యం,మౌలిక వసతుల కల్పన లో పూర్తిగా వెనక బడి ఉందని,మారుమూల గ్రామాల్లో నేటికి వైద్య సదుపాయాలు అందుబాటులో లేకపోవడం ఎంఎల్ఏ కు కనిపించడం లేదా అని ప్రశ్నించారు.11 మండలాల్లో గిరిజన కోటా లో గెలిచిన ఎంఎల్ఏ ఆదివాసీల చట్టాలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు అని ఆరోపించారు.ఆదివాసీల సమస్యల పై మాట్లాడేందుకు స్పీకర్ అవకాశమిస్తే గిరిజ నేతరుల కోసం చర్చించడం సరికాదని ఈ మాటను వెనక్కు తీసుకోవాలని లేకుంటే ఆదివాసీ లంతా ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు సెక్రటరీ మడిగొంట వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు పుడిగి లక్ష్మణరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు, పల్లాల రమణారెడ్డి, సర్పంచ్ బచ్చుల చిన్నమ్ములు, కలిమెల బాబూరావు, పల్లాల అబ్బాయి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీటీజీ గ్రామాల్లో ఉపాధి పనులను తక్షణమే కల్పించాలి

విశాలాంధ్ర - పెదబయలు: పీవీటీజీ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను తక్షణం కల్పించాలని సీపీఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కమిటీ కార్యదర్శి పి.అప్పలనరస రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా గురువారం మండలంలో సిపిఎం ప్రతినిధి బృందం పర్యటన చేసింది. సీపీఎం మండల కార్యదర్శి బోండా సన్నిబాబు నాయకత్వంలో అడుగులు పుట్టు పంచాయతీలో ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం ప్రతినిధి బృందం వద్ద బాధిత గిరిజనులు తమ సమస్యను తెలియజేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి ఆదిమ తెగలైన పి.వి.టి.జి కొండు గిరిజనులకు ఉపాధి పథకం పనులు కల్పించడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రమైన విచారణ నిర్వహించి తక్షణమే బాధ్యతలకు ఉపాధి పని కల్పించి గ్రామంలో ఉన్న 40 కుటుంబాలను ఆదుకోవాలని అన్నారు. అటవీ హక్కుల చట్టం అమల్లోకి వచ్చి నేటికీ సుమారు 20 సంవత్సరాలు కావస్తున్నా ఈ గ్రామంలో ఏ ఒక్కరికి అటవీ హక్కులు పట్టా ఇవ్వకపోవడం చారిత్రకమైన అన్యాయమని అన్నారు. గిరిజనులకు ఉచితంగా ఇసుక పంపిణీ చేయాలని, నాన్ పివిటిజి ఆదివాసులకు కూడా ఇల్లు నిర్మాణంలో యూనిట్ కాస్ట్ పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా నాయకులు వంతల దాస్‌తో పాటు ప్రజలు పాల్గొన్నారు.

ఆర్ అండ్ ఆర్ పిడిఎఫ్‌లో పేర్లు చేర్చాలి

విశాలాంధ్ర - కూనవరం: కూనవరం గ్రామపంచాయతీలోని ఆర్ అండ్ ఆర్ పిడిఎఫ్‌లో సుమారు 300మంది వివరాలు చేర్చబడలేదని తహశీల్దార్ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మాట్లాడుతూ నిర్వాసితులు కంగారు పడాల్సిన పనిలేదని ఎవరి పేర్లు అయితే తొలివిడత రాలేదో వారు మళ్ళీ అర్జీ పెట్టుకోవచ్చని, పేర్లు రాని వారి జాబితాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆయన అన్నారు. తహశీల్దార్‌ని కలిసిన వారిలో సిపిఐ డివిజన్ కార్యదర్శి కామ్రేడ్ గుజ్జా మోహన్ రావు, మండల కార్యదర్శి కామ్రేడ్ లంబు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు జుత్తుక సూర్యచంద్రరావు సూరం వెంకటేశ్వర్లు, టీడీపీ సీనియర్ నాయకులు ఎడవల్లి భాస్కరరావు, చెలికాని ఉమా ఎచ్చు రాము, పారి సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలను సందర్శించిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు

విశాలాంధ్ర - సీతానగరం: రాష్ట్ర ఆహార కమిటీ సభ్యులు బి కాంతారావు గురువారంనాడు పలువసతిగృహాలను ఆకస్మిక తనిఖీలుచేశారు. మండలంలోని మరిపివలస ఎస్సీ బాలికల వసతిగృహాన్ని, జోగుంపేట కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయంను, ప్రతిభ కళాశాలను, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాన్ని సందర్శించారు. ఆయన స్టాక్ రిజిస్టర్లు, ఫుడ్ క్వాలిటీను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన పిల్లలందరితో కలిసి మాట్లాడారు.పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి రిజల్ట్ తీసుకురావడానికి తగు సూచనలు తెలిపి ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖధికారి సూరిదేముడు, సమగ్ర శిక్ష అధికారి మధు కిషోర్, ప్రిన్సిపాల్లు, వార్డెన్లు, జిల్లా మండల అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా కోఆర్డినేటర్ రూపవతి

విశాలాంధ్ర - సీతానగరం: మార్చి 17 నుండి జరగనున్న పదవ తరగతిపరీక్షలలో శతశాతంఫలితాలు సాధించి గురుకులానికి మంచిపేరును తేవాలని ఉమ్మడి జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖ గురుకులాల కోఆర్డినేటర్ ఎస్ రూపవతితెలిపారు. గురువారంనాడు మండలంలోని జోగంపేట సాంఘీక సంక్షేమ గురుకుల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా సందర్శించారు.పదవ తరగతివిద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి మంచి ఫలితాలు సాధించాలని కోరారు .జిల్లాలోని ఈఏడాది పదోతరగతి పరీక్షలకు 360 మంది విద్యార్థులు హాజరుకానున్నారని చెప్పారు. గురుకులాల్లో అన్నివిద్యాసంస్థల్లో ప్రణాళిక బద్ధంగా విద్యను చెప్పడంతో పాటు మంచిఫలితాలు సాధించేందుకు కృషిచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జేవిఎస్ మధు, సీనియర్ లెక్చరర్ ఈశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే కుటుంబ అభివృద్ధి

ప్రధానోపాధ్యాయులు కనితి శేఖర్

విశాలాంధ్ర - ఎటపాక: ఎటపాక మండలం గౌరీదేవి పేట ఉన్నత పాఠశాల ఆవరణలో పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటుచేసిన వీడ్కోలు సమావేశంలో మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరేందుకు కష్టపడి చదవాలని, చదువు ద్వారా మాత్రమే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, ఉన్నత చదువులు చదువుకోవడానికి పదవ తరగతి తొలిమెట్టు లాంటిదని వివరించారు. విద్యార్థులు వారి వారి ఇష్టాలను బట్టి తగిన సబ్జెక్టును ఎంచుకొని అందులో ఉన్నతంగా రాణించడానికి కృషి చేయాలని తద్వారా గౌరవప్రదమైన గుర్తింపు లభిస్తుందని తెలియజేశారు. అనంతరం సబ్జెక్టు ఉపాధ్యాయులు పదో తరగతి పరీక్షల్లో అనుసరించవలసిన మెలుకువలు గురించి వివరించారు. ఈ సమావేశంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వినోద్ కుమార్, రవి, స్వరాజ్యలక్ష్మి, బాబు, లక్ష్మి, హాస్టల్ వార్డెన్ పవన్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

మోతుగూడెం క్రికెట్ టోర్నీ విజేత కుంట

విశాలాంధ్ర - మోతుగూడెం: గత 15 రోజులుగా మోతుగూడెం గ్రామానికి చెందిన దుల్లారి గోపి తల్లిదండ్రుల (లక్ష్మీ, భరత్ రామ్) జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న అంతరాష్ట్ర మెగా మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మొత్తం 44 జట్లు పాల్గొనగా అందులో ఫైనల్‌కు ఎర్రంపేట, కుంట జట్లు చేరుకున్నాయి. ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ కుంట జట్టు 16 ఓవర్లలో 88 పరుగులు చేయగా అనంతరం 89 పరుగుల విజయ లక్ష్యంతో బరిలో దిగిన ఎర్రంపేట జట్టు 63 పరుగులు చేసి ఆలౌట్ అయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ వాసుదేవరావు, డి.ఈ.బాలకృష్ణ, ఎస్.ఈ. కామేశ్వరరావు, డి.ఈ.టి. వరప్రసాద్ పాల్గొని క్రికెట్ టోర్నమెంట్లో విజేతగా నిలిచిన కుంట జట్టుకు 50 వేల రూపాయలు, రన్నర్స్‌గా నిలిచిన ఎర్రంపేట జట్టుకు 25వేల రూపాయలు, మూడవ స్థానంలో నిలిచిన మోతుగూడెం ఎంవైసీ టీం వారికి 10వేల రూపాయలు, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంలను ఎప్పుడు నియమిస్తారు...?

విశాలాంధ్ర - బెలగాం: గిరిజన విద్యార్థుల మరణాల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో ఎఎన్ఎంల నియామకం దస్త్రంపై మొదటి సంతకం పెట్టామని ప్రకటించిన గిరిజన సంక్షేమం శాఖ మంత్రి ఎప్పుడు ఎఎన్ఎంలను నియమిస్తారని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు.

పార్వతీపురం గిరిజన సామాజిక భవనంలో గురువారం గతంలో గిరిజన విద్యార్థులకు వైద్య సేవలు అందించిన "ఆదివాసీ ఆరోగ్య" సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రంజిత్ కుమార్ మాట్లాడుతూ గతంలో గిరిజన విద్యార్థులకు వైద్య సేవలు అందించిన ఆదివాసీ ఆరోగ్యం సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యమే ప్రస్తుత ప్రభుత్వం చేయడం మంచిది కాదన్నారు. గిరిజన విద్యార్థుల మరణాల నివారణకు ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది అవసరం అన్నారు. ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది సేవలు నిలుపుదల తర్వాత గిరిజన విద్యార్థుల మరణాలు పెరిగాయని తెలిపారు. ఈ సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్, గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు తాడంగి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైకిల్ - కారు ఢీ: భార్యాభర్తలకు తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - బెలగాం : మోటార్ సైకిల్‌ను కారు ఢీకొనడంతో భార్యాభర్తలకు గాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.

పార్వతీపురం మునిసిపల్ బెలగాం అగ్రహారం వీధికి చెందిన పాలంకి సత్య స్వరూప్ తన భార్య జ్యోతిని తీసుకుని మోటార్ సైకిల్ పై విశాఖపట్నం వెళుతుండగా సీతానగరం మండలం మరిపివలస గ్రామం సమీపంలో గల మలుపు వద్దకు చేరుకొనే సరికి ఎదురుగా బొబ్బిలి వైపు నుండి వస్తున్న రిజిస్ట్రేషన్ లేని కారు ఢీ కొట్టి అందులో ఉన్నవారు పరారయ్యారు. ఈసంఘటనలో భార్యభర్తలు ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండటంతో వెంటనే మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం రిఫర్ చేశారు. జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.

సుడిగాలి పర్యటన చేసిన స్టేట్ ఫుడ్ కమిషన్ సభ్యులు

విశాలాంధ్ర - పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో గురువారం నాడు రాష్ట్ర ఆహార కమిటీ సభ్యులు బి.కాంతారావు జిల్లాలో సుడిగాలి పర్యటన చేసి పలు మండలాల్లోహాస్టళ్లను, స్కూళ్లను, అంగన్వాడి కేంద్రాలను, పాఠశాలలను, ఎం ఎల్మ ఎస్ పాయింటులను మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. పలు సూచనలు చేశారు. ఈపర్యటనలో జిల్లా పౌర సరఫరాల అధికారి వై.కిరణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి టి.కనకదుర్గ, వైద్య ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డా. టి.జగన్మోహన రావు,ఫుడ్ కమిటీ సభ్యులు,విద్యాశాఖ అధికారులు, ఐసిడిస్ అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.